నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

- గ్రామాల్లో హమాలీల కొరత
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఆందోళనలో రైతన్నలు


సిరిపురం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు


కాగితరామచంద్రాపురంలో..

నడిగూడెం : మండలంలో ప్రభుత్వం ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిచాయి. కొన్ని కేంద్రాల్లో దాదాపు 20 రోజులుగా కాంటాలు వేయడం లేదు. వరుసగా అకాల వర్షాలు కురుస్తుండడం, హమాలీల కొరతతో కొనుగోళ్లు ముందుకు సాగడం లేదు. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వర్షాలతో నష్టపోయామని, మళ్లీ వర్షం పడితే ధాన్యం రాశులు మొలకలు వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నడిగూడెం మండల కేంద్రంతో పాటు, కాగితరామచంద్రాపురం, కరివిరాలలో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రారంభించారు. అలాగే ఐకేపీ ఆధ్వర్యంలో సిరిపురం, నారాయణపురం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. కానీ కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. సిరిపురంలో 20 రోజులుగా కాంటాలు వేయడం లేదు. అలాగే కాగితరామచంద్రాపురంలో వారం రోజులుగా ధాన్యం రాశుల వద్ద రైతులు పడిగాపులు గాస్తున్నారు. అయితే 17 శాతం తేమ వచ్చినా కొనుగోలు చేయక పోవడంతో వేలాది బస్తాల ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉందని రైతులు చెబుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం..

నడిగూడెం, కాగితరామచంద్రాపురం, సిరిపురం, నారాయణపురం, కరివిరాల గ్రామాలలో గత రెండు వారాలుగా వర్షం ప్రభావంతో పాటు హమాలీల సమస్య వేధిస్తుండడంతో కాంటాలు ముందుకు సాగడం లేదని రైతులు అంటున్నారు. నడిగూడెం, కరివిరాల గ్రామాలలో స్థానిక హమాలీలు ఇతర గ్రామాలకు చెందిన హమాలీలను రానివ్వకపోవడంతో సమస్య ఎక్కువైందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కురిసిన వర్షాలకు పలువురు రైతులకు చెందిన ధాన్యం తడిసిందని, ఆ ధాన్యాన్ని ఆరబెడుతున్నామని రైతులు చెబుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ధాన్యం కాంటాలు వేయడం ఆలస్యమవుతుందని సిరిపురం గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. మళ్లీ భారీ వర్షం కురిస్తే నిండా మునుగుతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే ధాన్యం కాంటాలు వేయాలని రైతులు కోరుతున్నారు.

20 రోజులుగా ఎదురుచూస్తున్నాను



సిరిపురం గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో 20 రోజులు క్రితం 14 ఎకరాల ధాన్యం పోశాను. తేమ శాతం కూడా 17 వచ్చింది. అయినా నేటికీ కాంటా వేయడం లేదు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కాంటాలు వేసేలా చర్యలు తీసుకోవాలి.

– కేసగాని మట్టయ్య, సిరిపురం

అధికారులు స్పందించాలి



కాగితరామచంద్రాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో వారం రోజుల కిందట ధాన్యం పోశాను. నేటికీ కాంటాలు వేయలేదు. ఎప్పుడు వర్షం పడుతుందోనని ఆందోళనగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– నీలకంఠం వెంకన్న, కాగితరామచంద్రాపురం

క్లుప్తంగా

గరిడేపల్లి ఎస్‌ఐగా వెంకట్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి

గరిడేపల్లి : గరిడేపల్లి ఎస్‌ఐగా పోసిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ కొండల్‌రెడ్డి నల్లగొండ ఎస్‌బీకి బదిలీ అయ్యారు. దీంతో నల్లగొండ వన్ టౌన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న వెంకట్‌రెడ్డి బదిలీపై గరిడేపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పనిచేస్తానన్నారు. కాగా ఎస్‌ఐ వెంకట్‌రెడ్డికి పోలీస్ సిబ్బంది స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

హుజూర్‌నగర్(చింతలపాలెం) : క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కె.వెంకటరెడ్డి అన్నారు. జిల్లా యువజన, క్రీడాల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని దొండపాడులో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, పాటిల్, ఇసాక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిలుకూరు : చిలుకూరు పరిధిలో గల శ్రీ జ్వాలా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు పీటల మీద కూర్చొని స్వామివారి కల్యాణం జరిపించారు. ఆలయ పూజారి సిరికొండ పృథ్వీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలో గల శ్రీ ఉమామహేశ్వర ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ లక్ష్మణరావు గురువారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నల్లగొండ వారికి దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. దరఖాస్తు పత్రాలు ఆలయ అర్చకుల వద్ద లభిస్తాయని తెలిపారు.

నేటి నుంచి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు

చిలుకూరు : కొత్త చిలుకూరులో బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు, విగ్రహాల ఊరేగింపు, హోమం నిర్వహించనున్నారు. ఆదివారం విగ్రహాల ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమం ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి నెలకు వెయ్యి రూపాయలు పెంచుతూ సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ గురువారం పారిశుద్ధ్య కార్మికులు నేరేడుచర్ల ప్రధాన కూడలిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌కేవీ మండల అధ్యక్షుడు కనకరాజు రాంబాబు, మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు జానీ, ఉపాధ్యక్షుడు వెంకన్న, శ్రీకాంత్, సైదులు, శ్రీను, మట్టయ్య, గురువమ్మ తదితరులు ఉన్నారు.

ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలోని టిప్పర్స్ యూనియన్ డ్రైవర్, ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏఐటీయూసీ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బ్రహ్మం, నర్సింహారావు, శ్రీను, కొండా, కుమారస్వామి, లెనిన్, విజయ్, మహిమూద్, భాగ్యరాజు, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే చేపట్టి నివేదిక అందిస్తాం

- ఆర్డీఓ వెంకారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకారెడ్డి

హుజూర్‌నగర్ : ఎలక్షన్ కమిషన్ అందించే సమాచారాన్ని రాజకీయ పార్టీలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామని ఆర్డీఓ కె.వెంకారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నియోజకవర్గ స్థాయి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఒకే ఇంటిలో ఆరుగురి కంటే ఎక్కువ మంది ఉన్న ఓటర్ జాబితాను ఎలక్షన్ కమిషన్ ఇచ్చిందని తెలిపారు. ఆ జాబితా ప్రకారం బీఎల్‌ఓల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి సదరు ఓటర్లు ఆ నివాసంలో ఉన్నారా, లేరా అని సరిచూసుకొని నివేదిక అందజేస్తామన్నారు. ఇంటి నెంబర్ తప్పుగా నమోదైతే ఫారం 8 ద్వారా నమోదు చేస్తామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు బూత్ లెవల్ కమిటీలను నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ వజ్రాల జయశ్రీ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కమలాకర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎల్లవుల రాములు, వేముల శేఖర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, జక్కుల శంభయ్య, శ్రవణ్‌కుమార్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై సమీక్ష

నేరేడుచర్ల : ఓటరు జాబితా సవరణపై గురువారం మండల తహసీల్దార్ కార్యాలయంలో హుజూర్‌నగర్ ఆర్డీఓ వెంకారెడ్డి రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపు తదితర వాటిపై ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ సరిత, ఆర్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

తాలు లేని ధాన్యం తీసుకురావాలి

- ఆర్డీఓ కిషోర్‌కుమార్


ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కిశోర్‌కుమార్

మునగాల : ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతాంగం నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోదాడ ఆర్డీఓ ఎల్.కిశోర్‌కుమార్ కోరారు. గురువారం మండలంలోని రేపాల, తాడువాయిలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు మండల కేంద్రంలోని శ్రీబాలాజీ రైస్ మిల్, నాగార్జున రైస్‌మిల్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చే ధాన్యాన్ని ఆరబెట్టి, తాలు లేకుండా తూర్పార బట్టి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఆయన వెంట స్థానిక ఇన్‌చార్జ్ తహసీల్దార్ జవహర్, ఏఓ బి.అనీల్ కుమార్, ఏపీఎం నాగెల్లి నగేష్, ఏఈఓ ఉప్పయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు అజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ భరోసా సభను జయప్రదం చేయాలి


చిలుకూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

చిలుకూరు : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఈ నెల 7వ తేదీన నిర్వహించబోయే బహుజన సమాజ్ పార్టీ తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. గురువారం చిలుకూరులోని హరిజనవాడలో సభ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు కందుకూరి ఉపేందర్, నాయకులు ముదిగొండ నాగయ్య, శ్రీను, మేరీ, చిరంజీవి, వెంకన్న, రంజిత్, శివాజీ, వీరబాబు, వీరేందర్, కుటుంబరావు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకుంటున్న మహేష్‌రెడ్డి


ఆర్థికసాయం అందజేస్తున్న సామాజిక కార్యకర్త మహేష్‌రెడ్డి

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన 65 సంవత్సరాల షేక్ సిద్దయ్యకు ప్రభుత్వం నుంచి పెన్షన్ మంజూరు కాలేదు. దీంతో అతను ఆర్థిక ఇబ్బందులు పడుతుండడంతో అదే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గార్లపాటి మహేష్‌రెడ్డి గత 10 నెలలుగా నెలకు రూ.2 వేలను స్వచ్ఛందంగా అందజేస్తూ మానవత్వం చాటుకుంటున్నాడు. గురువారం ఈ నెల రెండు వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్‌రెడ్డిని పలువురు అభినందించారు.

కొండాపురం సర్పంచ్ భర్త మృతి


నరసింహారావు (ఫైల్)

చిలుకూరు : మండలంలోని కొండాపురం గ్రామ సర్పంచ్ వేనేపల్లి సుగుణమ్మ భర్త, రిటైర్డ్ వీఆర్‌ఓ వేనేపల్లి నరసింహారావు (76) అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. దీంతో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్.. నరసింహారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నరసింహారావు మృతి పట్ల మండల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో గురువారం ఆకుపాముల గ్రామానికి చెందిన గూటి నరేష్– నవ్య దంపతుల కుమార్తె కారుణ్యశ్రీని పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు బక్క నాగేశ్వరరావు, కాసాని వెంకటనారాయణగౌడ్, చిరంజీవి, అబ్దుల్, సతీష్, సాయి, ఉపేందర్, సీతయ్య, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ పాల్గొన్నారు.


అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

సువార్త స్వస్థత పండుగను విజయవంతం చేయాలి

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించబోయే క్రీస్తు సువార్త స్వస్థత పండుగను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ బిషప్.డా.జె.సుదర్శనం కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని పెనుయేలు చర్చిలో విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పండుగలో భాగంగా క్రీస్తు సందేశం అందించడానికి సుదూర ప్రాంతం నుంచి దైవభక్తులు రానున్నారని తెలిపారు. శనివారం ఉదయం వర్షిప్ కేంద్రంలో జరిగే పాస్టర్ల సమావేశానికి హాజరుకావాలన్నారు. ఆదివారం రాత్రి జరిగే చివరి రాత్రి పండుగలో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

నడిగూడెం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం మునగాల బ్యాంకు జనరల్ మేనేజర్ వీరయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ రమాదేవి, సీఈఓ యలమందరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి


సర్పంచ్‌కు వినతిపత్రం ఇస్తున్న పోస్టల్ సిబ్బంది

మఠంపల్లి : మండల కేంద్రంలో పోస్టాఫీసుకు సొంత స్థలం, గది కేటాయించాలని కోరుతూ గురువారం స్థానిక సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డికి పోస్టల్ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. సమస్యను తప్పకుండా పరిష్కరిస్తానని వారికి సర్పంచ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండేటి సుధాకర్‌రెడ్డి, మన్నెం సీతారామిరెడ్డి, వల్లబుదాస్ సురేష్‌గౌడ్, పోస్టల్‌సిబ్బంది జోసు, గోపి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ ఆలయ వార్షికోత్సవం


బోనాలతో ఆలయానికి తరలివెళ్తున్న ఎమ్మెల్యే సతీమణి రజిత, మహిళలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడులోని గంగమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సతీమణి రజిత ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి కోలాటం వేసి అందరిని ఉత్సాహపరిచారు. బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం ఆమెను స్థానికులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరెడ్డి, సర్పంచ్ పద్మ, జెడ్పీటీసీ చంద్రకళ, నాయకులు, యాదవులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


లాల్‌లక్ష్మీపురం రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

నేరేడుచర్ల : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని స్థానిక ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మండలంలోని కల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని లాల్‌లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామాంజనేయ ఆలయంలో గురువారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, పాలకవీడు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అంజిరెడ్డి, సర్పంచ్ పల్లెపంగ నాగరాజు, ఎంపీటీసీ నాగవేణి గురువయ్య, నాయకులు శ్రీనివాస్, నాగరాజు, కడియం వెంకట్‌రెడ్డి, మురళి తదితరులున్నారు.

త్వరలో గృహలక్ష్మి పథకం అమలు

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

నడిగూడెం : రాష్ట్రంలో గృహలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్నట్లు కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వెల్లడించారు. గురువారం ఆయన మండల పరిధిలోని వల్లాపురం వచ్చిన సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోదాడ నియోజకవర్గంలో గృహలక్ష్మి పథకం ద్వారా మూడు వేల మందికి ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి ప్రభుత్వం మూడు లక్షల రూపాయలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నియోజవర్గంలోని పలు మండలాలలో తొలి విడతగా 100 శాతం సీసీ రహదారుల పనులు పూర్తయినట్లు తెలిపారు. రెండో విడతగా డ్రెయినేజీ కాల్వల నిర్మాణంపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా రూ.50 కోట్ల వ్యయంతో బీటీ రోడ్ల పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట వల్లాపురం గ్రామ సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ దేవబత్తిని సురేష్ ప్రసాద్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య, నడిగూడెం సహకార సంఘం చైర్మన్ పుట్టా రమేష్, ఇమ్మడి వెంకన్న, నడిగూడెం, మోతె, అనంతగిరి మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల నిరవధిక సమ్మె


చిలుకూరు : జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న కైలాసం వెంకటేశ్వర్లు


హుజూర్‌నగర్‌రూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

చిలుకూరు : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కైలాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు పొనుగోటి కోటయ్య, రావర్తి రామనర్సయ్య డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం జేపీఎస్‌లు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన నిరవధిక సమ్మెకు వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అలాగే సమ్మెకు సీపీఐ మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సాహెబ్ అలీ, నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం జూనియర్ కార్యదర్శులు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అశోక్ వర్మ, సారిక, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రామారావు, శోభన్‌బాబు, కార్తిక్, కవిత, నవీన్, ఆవినాష్‌రెడ్డి, అంజయ్య, ప్రవళిక, సౌమ్య, ఆకాంక్ష, రాము తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కార్యదర్శుల ర్యాలీ

హుజూర్‌నగర్‌రూరల్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకుడు బొమ్మకంటి నరేష్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై జేపీఎస్‌లు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఇందిరా సెంటర్‌లో మానవహారం నిర్వహించి శాంతియుత దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో జేపీఎస్ జేపీసీ నాయకులు ఐతగాని నాగమణి, చంటి, ఉమా, నరేందర్‌రెడ్డి, గీత, నరసింహ, నరేష్, నాగేంద్రబాబు, శేఖర్, మోతీలాల్, వినయ్‌కుమార్, సైదానాయక్, రాజా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల వైభవాన్ని చాటి చెప్పాలి


వెంకటనర్సయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్నూరు కాపు నాయకులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో గల మున్నూరు కాపు అన్నదాన సత్రానికి కులదైవం శ్రీకృష్ణదేవరాయల పేరుపెట్టడం ఎంతో గర్వించదగినదని, ఆయన వైభవాన్ని చాటి చెప్పాలని ఆ సంఘం నాయకుడు, సత్రం కమిటీ కన్వీనర్ తోట వెంకయ్య అన్నారు. గురువారం మట్టపల్లిలో ఉత్సవాల సందర్భంగా వచ్చిన ఆంధ్రా, తెలంగాణ సభ్యులు, నాయకులు స్థానికంగా గల శ్రీకృష్ణదేవరాయల విగ్రహంతో పాటు, సత్ర నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన మాజీ సర్పంచ్ దివంగత బజ్జూరి వెంకటనర్సయ్య విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి వెంకటరమణ, బజ్జూరు నారాయణస్వామి, కోలా నాగేశ్వరరావు, వెంకయ్య, అప్పయ్య, కాశయ్య, నాగసైదులు, ఆదినారాయణ, మురళి, విజయ, అప్పారావు, అచ్యుతరావు, శ్రీనివాస్, రామయ్య, వెంకటేశ్వరరావు, జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి

- ఎస్పీ రాజేంద్రప్రసాద్


గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

గరిడేపల్లి : పట్టణాలు, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రూ. 2. 70 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలు, పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ప్రముఖులు, చిరు వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, పౌరులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నిర్వహించిన సీసీ కెమెరాల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజం సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో దొంగలు, కేటుగాళ్లు కొత్త తరహాలో దొంగతనాలు, మోసాలు, నేరాలకు పాల్పడుతున్నారన్నారు. అసాంఘిక చర్యలు, అనైతిక చర్యలు పెరుగుతున్నాయని, కావున నిఘా నేత్రాల అవశ్యకత ఎంతైనా అవసరమన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లయితే పిల్లలు, యువత క్రమశిక్షణగా ఉంటారన్నారు. దొంగతనాలు, నేరాలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి నిందితులను పట్టుకోవచ్చన్నారు. కోర్టుల నందు సాంకేతిక ఆధారాలను చూపించవచ్చన్నారు. కాలనీలు, దుకాణ, వ్యాపార సముదాయాలు, భవన సముదాయాలు, నివాస గృహాలు తదితర వాటిల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాష్ట్ర పోలీస్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ సెంటర్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి, ఎస్‌ఐలు తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐకి ఎస్పీ అభినందన..

బదిలీపై వెళ్తున్న గరిడేపల్లి ఎస్‌ఐ కొండల్‌రెడ్డిని ఎస్పీ రాజేంద్రప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. కొండల్‌రెడ్డి ప్రజల్లో మమేకమై పని చేశారన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించారని, కొండల్‌రెడ్డి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ శ్రీనివాస్, గరిడేపల్లి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ త్రిపురం సీతారాంరెడ్డి, పెండెం వీరయ్యగౌడ్, రాజ్ మహమ్మద్, బొంత వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్, సతీష్‌రెడ్డి, యాదగిరి, అనంతరాములు, కాశయ్య, పలువురు నాయకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని దోచుకుంటున్న ప్రభుత్వాలు


నర్సయ్య, బసవయ్య స్మారక స్థూపాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గరిడేపల్లి : సంక్షేమం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాధనాన్ని దోచుకుంటున్నాయని సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్ ఆరోపించారు. గురువారం మండలంలోని పొనుగోడులో పార్టీ నాయకులు అందే నరసయ్య, సుందరి బసవయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అందె నరసయ్య, బసవయ్యలు ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నందిపాటి మట్టయ్య, చామకూరి వెంకటప్పయ్య, సైదులు, వెంకట్‌రెడ్డి, రామ్ తిరుపతయ్య, బత్తిని లక్ష్మీనర్సు, బి.రాములు, హుస్సేన్, ప్రమీల నర్సింహారావు, మల్లయ్య తదితరులు ఉన్నారు.